

(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

2022-నవంబర్

బయట గేటు మూసేసిన శబ్దమూ, ఆ తరవాత బైకు స్టార్టయిన చప్పుడూ వినిపించాయి. అందరూ నిశ్శబ్దంగా ఊపిరి వదిలారు. డైనింగ్ టేబుల్ చుట్టూ అందరూ కాసేపు అలాగే కదలకుండా కూర్చున్నారు. మెల్లిగా భాను లేచి వెళ్ళి వంటింట్లోకి వెళ్ళిపోయింది, ఆలోచించుకోవడానికన్నట్టు. ఆమె మనసంతా అల్లకల్లోలంగా, ఆందోళనగా వుంది. తుఫాను ముందరి ప్రశాంతతలా, బాంబు పేల బోయే ముందు వాతావరణంలా వుంది వంటిల్లూ, డైనింగు రూమూ. అశోక్ ఎవరి వైపు చూస్తే ఏ సమస్య లేస్తుందోనని, పళ్ళాల వైపే చూస్తున్నాడు.

భార్గవ్ ఫోన్ స్క్రోల్ చేస్తున్నాడు కానీ, ఏదీ అతని మనసుకెక్కడంలేదు. పద్మనాభం సోఫాలో కూర్చొని హిందూ పేపర్ ఎప్పుడూ లేనంత దీక్షగా చదువుతున్నాడు. అనఘ కర్టెన్లు సవరిస్తూ ఓరకంట అందరినీ గమనిస్తూంది. అందరికీ, ఈ నిశ్శబ్దాన్ని ఎవరైనా భంగపరచి మాట్లాడితే బాగుండని వుంది. ఎవరికీ ఏం మాట్లాడాలో తోచడం లేదు.

అశోక్ ఆలోచిస్తున్నాడు. నిజానికి అతనికి అజహర్ చాలా నచ్చాడు. దాదాపు పాతికేళ్ళ వయసులో వున్నట్టున్నాడు. పచ్చగా, పొడవుగా, మెరిసే కళ్ళతో, చదువూ సంస్కారం వున్నవాడిలాగే కనిపించాడు.

"హలో అంకుల్", అంటూ మర్యాదగా తనతో చేయి కలిపాడు. అతని వాలకమూ, మాటా, పద్ధతీ చూసిన తరవాత భాను కూడా కొంచెం రిలాక్స్ అయింది. తన చెల్లెలు అమీరా, అనఘా క్లాస్ మేట్స్ అనీ, అలా పరిచయమనీ చెప్పాడు. తమకి మెడికల్ షాపు బిజినెస్ వుందనీ, దాన్ని తండ్రి అజమాయిషీలో తను మేనేజ్ చేస్తున్నాననీ చెప్పాడు.

"మావిడికాయ పప్పు చాలా బాగుంది ఆంటీ," కొంచెం మొహమాటపడుతూ మళ్ళీ వేయించుకున్నాడు. భార్గవ్ తో తనకి మాయా బజార్ అన్నిటికంటే ఇష్టమైన సినిమా అని చెప్పి, ఆ సినిమా స్క్రీన్ ప్లే గురించి చర్చించాడు. ఏ మాత్రమూ అతి ఉత్సాహం ప్రదర్శించలేదు. తమని ఇంప్రెస్ చేయడానికసలు ప్రయత్నించలేదు. ఇదే తన పద్ధతి అన్నట్టు హుందాగా వున్నాడు.

అసలు తనకి అజహర్ ఏమాత్రమూ నచ్చడనీ, తనకి నచ్చనివాడిని పెళ్ళాడడానికి అనఘ ఇష్టపడదనీ అనుకొని కొంచెం ధైర్యంగానే వున్నాడు తను. కానీ, ఆ అబ్బాయి ఇంతలా నచ్చడమే ఇబ్బందిగా వుంది ఇప్పుడు.

అజహర్ లాటి పిల్లలని తన క్లాసు రూములో చాలాసార్లు చూసాడు. చదువు గురించిన ఆలోచనలూ, భవిష్యత్తుని గురించిన ఆశలూ, ప్రతి విషయాన్ని గురించి పరిశీలనగా ఆలోచించి ఏర్పరుచుకున్న అభిప్రాయాలూ, సంఘాన్ని గురించీ, రాజకీయాల గురించీ అవగాహన వున్న అటువంటి పిల్లలని తాను ఎంతో అభిమానించి ప్రోత్సహించాడు. ఇప్పుడు ఇదే అజహర్ తన క్లాసులో ఎదురుపడితే ఎంతో అభిమానించగలడు కూడా. కానీ ఇదే అజహర్ తన అల్లుడిగా వస్తే? ఎందుకో అక్కడే తన ఆలోచన ఆగిపోతూ వుంది. తను అలవాటు చేసుకొనీ, పిల్లలకి బోధించే అభ్యుదయము వొట్టి మాటల వరకేనా? కులాంతర వివాహానికి ముఫ్ఫై యేళ్ళ క్రితమే ధైర్యంగా సిద్ధ పడ్డ తాను మతాంతర వివాహానికి ఇంత జంకుతున్నాడంటే తను ముందుకెళ్తున్నట్టా, వెనక్కెళుతున్నట్టా?

భాను లోపలినించి టవల్‌తో చేతులు తుడుచుకుంటూ బయటికొచ్చి, టేబుల్ ముందు కుర్చీలో కూలబడింది. అశోక్ తలెత్తి ఆమె వైపు చూసి నవ్వే ప్రయత్నం చేసాడు. అనఘ కూడా వచ్చి అక్కడే తల్లి పక్కన కూర్చుంది.

"చెప్పు నాన్నా, వాట్ డు యూ థింక్ ఆఫ్ హిం? మీకు నచ్చాడా?"

"మాకు నచ్చడం యేమిటి? యెందుకిప్పుడు?" ఏమీ తెలియనట్టు తేల్చేయబోయింది భాను.

"అమ్మా, ప్లీజ్! ఏమీ తెలియనట్టు మాట్లాడొద్దు. నేను అజహర్‌ని ఎందుకు ఇంటికి తీసుకొచ్చి మీకు ఇంట్రొడ్యూస్ చెసానో అర్థం కాలేదా? నాన్నా! యూ టెల్ మీ! నీకు అజహర్ నచ్చలేదా?"

"లేదు!" జవాబు భాను నుంచి వచ్చింది. అనఘతోపాటు పద్మనాభం కూడా ఆశ్చర్యంగా తలెత్తి చూసాడు. భాను అంత మొండిగా ఎప్పుడూ మాట్లాడదు.

"నచ్చలేదా? ఎందుకు? ఏం తక్కువైందతనికి? చదువా? సంస్కారమా? ఉద్యోగమా? డబ్బా? అంద చందాలా? ఏ విషయంలో అతను మీకు నచ్చలేదు?" అనఘ గొంతు పెరిగింది.

"అదేం లేదు అనూ! హీ సీమ్స్ టు బీ ఎ నైస్ బాయ్!" అశోక్ మెల్లిగా అన్నాడు.

"అంటే నచ్చాడన్నమాటేగా?"

"లేదు. ఊరికే ఒక స్నేహితుడిలా బానే వున్నాడు కానీ, ఇంటి అల్లుడులా అంటే, అది వేరే విషయం." భాను ఈసారి కొంచెం దృఢంగా అన్నది.

"ఎందుకంటే అతను హిందువు కాదు కాబట్టి, అంతేనా? ఈజ్ దిస్ వాట్ ఇట్ ఈస్ ఆల్ అబవుట్?"

వున్నట్టుండి అశోక్‌కి భాను మాటల్లో ఎంతో నిజమున్నట్టు అనిపించింది. భాను అన్న మాట నిజమే. మంచి కుర్రాడు. అన్ని విధాలా బాగున్నాడు. కానీ అతనితో భవిష్యత్తు చాలా చిక్కులతో కూడి వుండొచ్చు. చక్కటి కుర్రాణ్ణి బయటినుంచి ఎంతైనా అభిమానించి పక్కన కూర్చోబెట్టుకోవచ్చు, కానీ పిల్ల భవిష్యత్తు గురించి కూడా ఆలోచించాల్సిన భాధ్యత తమ మీద వుంది.

"నో అనూ! దిస్ ఈజ్ అబవుట్ యువర్ ఫ్యూచర్," అన్నాడు అశోక్.

"నా ఫ్యూచరా? దానికేమొచ్చింది ఇప్పుడు?"

"పెళ్ళంటే ఒక రోజు సినిమాకి వెళ్ళి రావడమో, పిక్నిక్ వెళ్ళి రావడమో, యేడాది పాటు కలిసి వుండడమో కాదు. బ్రతుకంతా కలిసి వుండాల్సిన బాధ్యత. నీకు యేమాత్రం పరిచయం లేని పరిస్థితుల్లో బ్రతగ్గలవా? చాలా ఆలోచించుకోవాల్సిన విషయం."

"అంటే, అతను హిందువు అయ్యుంటే ఒప్పుకునేవారన్నమాట."

"అతను హిందువు అయినా నేను ఒప్పుకోను!" భాను మాటలకి ఈసారి అశోక్ కూడా ఆశ్చర్యపోయాడు.

"అతనికి ఉద్యోగం సద్యోగం లేదు. తండ్రి బిజినెస్ చూస్తున్నాడట. అంటే పూర్తిగా వాళ్ళ దయా ధర్మాల పైన ఆధారపడి వుండాలన్నమాట. అనూ, నీకు ఇరవై యేళ్ళు! ఇంకా బీయెస్సీకూడా పూర్తి కాలేదు. నువ్వింకా ఎమ్మెస్సీ దాకా చదువుతుకుంటావనీ, మంచి ఉద్యోగం తెచ్చుకుంటావనీ ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. ఇప్పుడవన్నీ వొదిలేసి పెళ్ళి చేసుకుంటావు. రెండేళ్ళలో పిల్లలు కూడా పుట్టారంటే చదువూ, కెరియరూ అన్నీ అటకెక్కినట్టే. వాళ్ళ ఇంట్లో నీకు నచ్చినా నచ్చకపోయినా సర్దుకుని వుండాల్సిందే. ఇద్దరికిద్దరూ ఉద్యోగాలు లేకుండా ఎలా బ్రతుకుతారు? పస్తులుంటారు లేదా, ఇక్కడికొచ్చి పడతారు. అప్పుడు మీ అన్నతో పాటు మీ ఇద్దరినీ కూడా కూర్చోబెట్టి నేను పోషించాలి. అది నా వల్ల కాదు. అందుకే, స్వయంగా నిర్ణయాలు తీసుకునేంత పెద్ద దానివి కావాలంటే ముందా చదువు పూర్తి చేయి. నీ కాళ్ళ మీద నువ్వు నిలబడు. అప్పుడు ఆలోచిద్దాం."

"అమ్మా, నువ్వు నన్ను కూర్చోబెట్టి పోషిస్తున్నావా?" భార్గవ్ బాధగా అన్నాడు.

"కాదా? నీకెన్నేళ్ళురా భార్గవ్? ఇరవై మూడేళ్ళు. నీ తోటి వాళ్ళందరూ బీయెస్సీనో, ఇంజినీరింగో పూర్తిచేసి పై చదువులో ఉద్యోగాలో చేసుకుంటున్నావు. నీ సంగతేంటి? అసలు నీ ఫ్యూచర్ ప్లానేంటి? నువ్వు చేసిన షార్ట్ ఫిలింస్ ఎంత మంది చూస్తున్నారు? నీ భవిష్యత్తు ఎలా వుండబోతుంది? యెప్పటికి నీ బాధ్యత తెలుసుకుంటావు? యెన్నాళ్ళని మీ అందరి బరువూ నేను మోయాలి? నాకూ యాభై యేళ్ళొచ్చాయి. ఇరవై యేళ్ళప్పుడు వుద్యోగంలో చేరాను. నాకు అలసటగా వుండదా? " భాను కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. గొంతు పూడుకొనిపోయి మాట్లాడడం ఆపేసింది.

"భానూ! ఇప్పుడు విషయం అది కాదు. మనం అనూ నిర్ణయాల గురించి మాట్లాడుకుంటున్నాం. నువ్వన్న మాటా నిజమే. అనూ, కొన్ని రోజులు ఈ చర్చ ఆపేద్దాం. ఇప్పుడైతే చదువు మీద ధ్యాస పెట్టి చదువుకో. " అశోక్ పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసాడు.

"దిస్ ఈజ్ రిడిక్యులస్! నేనూ ఇప్పుడు పెళ్ళి చేసుకునే ఆలోచనలోనే లేను. మీకు పరిచయం చేసింది ఇంకో రెండు మూడేళ్ళ తరవాత ఇతన్ని నేను పెళ్ళి చేసుకుంటాను అని చెప్పటానికి. ఈ లోగా మా ఇద్దరినీ ఏ రోడ్డు మీదో చూసి ఎవరో మీతో ఏదో అనటం, మీరు ఆహా ఓహో అని నన్ను సతాయించడం, అవసరమా ఈ డ్రామా? అదంతా అవాయిడ్ చేయడానికి పరిచయం చేసాను. కాబట్టి రిలాక్స్! నేను తప్పకుండా గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తాను."

"అలాగా!మరి ఈ రెండేళ్ళూ సినిమాలూ పార్కులూ అంటూ ఊరంతా తిరిగి మా పరువు తీస్తారన్నమాట! అలాటి పిచ్చి వేషాలేస్తే నేనొప్పుకోను!" భాను అరిచింది.

"భానూ! ఇక చాలు. నువ్వెళ్ళి పడుకో! అనూ, నువ్వూ లోపలికి వెళ్ళమ్మా!తరవాత మాట్లాడదాం!" పద్మనాభం సోఫా లోంచి లేచి వొచ్చాడు. భాను చేతిలోంచి టవల్స్ అన్నీ తీసుకొని ఆమెని లేపి లోపలికి పంపించాడు.

" తాతయ్యా! ఇదేం న్యాయం! అమ్మా నాన్నా వాళ్ళా పెళ్ళికి నాలుగేళ్ళ ముందు నుంచీ స్నేహితులని చెప్పింది అమ్మ. ఇప్పుడు నన్నేమో అన్నిటికీ అడ్డు చెప్తూ వుంది! నేనింకా మా అమ్మా నాన్న చాలా ప్రొగ్రెసివ్ అనుకున్నాను. వీళ్ళకంటే మీరే నయం. వాళ్ళ పెళ్ళికి పెద్ద పేచీలు పెట్టకుండా ఒప్పుకున్నారు." అనఘ కన్నీళ్ళతో అంది. ఆ మాటలకి పద్మనాభమూ, అశోకూ ఒక్కసారి మొహాలు చూసుకొని కళ్ళు తిప్పేసుకున్నారు.

★★★★★★★★★★★★★★

అశోక్ కళ్ళు మూసుకొని చేతులు కళ్ళపై పెట్టుకోని పడుకొని వున్నాడు. భాను బెడ్‌రూం తలుపులు వేసుకుని పడుకోని వుంది. ఆమెని డిస్టర్బ్ చేయడం ఇష్టం లేక స్టడీలో సోఫాలో పడుకొని వున్నాడు.

"నాన్నా!"

అను తలుపు దగ్గర నిలబడివుంది. సాయంత్రం వేసుకున్న జీన్స్ కుర్తీలోనే వుంది. మొహమంతా అలిసిపోయినట్టు వుంది.

"కెన్ ఐ కం ఇన్?" తలుపు దగ్గరే నిలబడి అడిగింది.అతనికి నవ్వొచ్చింది.

"ఎప్పుడూ లేనిది ఇదేమి అలవాటు అనూ? రా లోపలికి!" కళ్ళజోడు తుడుచుకుంటూ అన్నాడు. లోపలికొచ్చి కూర్చుంది అనూ. టేబుల్ మీద పేపర్ వెయిట్ చేతిలోకి తీసుకొని అటూ ఇటూ తిప్పి, మళ్ళీ అక్కడే పెట్టేసింది.

"నాన్నా! నీతో మాట్లడాలి!" నవ్వాడు అశోక్!

"అవునా? దేని గురించి?"

"నాన్నా! స్టాప్ జోకింగ్! నిజం చెప్పు! నీకు అజహర్ నచ్చలేదూ?"

నిట్టూర్చాడు అశోక్. ఏమీ జవాబివ్వలేదు.

"అతను అజహర్ కాకుండా అర్జున్ అయితే ఇవాళ మన ఇంటి వాతావరణం ఇలా వుండేదా?"

"అనూ! అతను అజహర్ అయినా, అర్జున్ అయినా, నీకింకా పెళ్ళి చేసుకునే వయసు రాలేదు. చదువు పూర్తి కాకుండా పెళ్ళి చేసుకోవడం ఎవరికీ మంచిది కాదు."

"నాన్నా! ఇప్పట్లో పెళ్ళి చేసుకొను. చదువు పూర్తయ్యాకే పెళ్ళి చేసుకుంటాను."

"మరి ఇప్పణ్ణించి ఈ విషయం గురించి వాదులట యెందుకు? రెండేళ్ళ తరవాత మాట్లాడదాం."

"అదే, యెందుకు అని అడుగుతున్నాను. ఇదే అతను హిందువుల అబ్బాయైతే,ఎగిరి గంతేసి అతని కుటుంబాన్ని కలుద్దాం అని ప్లాన్ వేసేవాళ్ళు కాదా?"

ఆమె మాటల్లో నిజం వుందని తెలిసిన అశోక్ మాట్లాడలేదు.

"చెప్పు నాన్నా! నువ్వు చాలా లిబరల్‌గా ఆలోచిస్తావు కదా? నీకు యేమిటి ప్రాబ్లం? అతను నీకు నచ్చలేదా?"

"సమస్య అతను కాదు అనూ! నువ్వు, నీ భవిష్యత్తు!"

"నా భవిష్యత్తుకేమయింది? చదువు పూర్తి చేసుకుని, ఉద్యోగం సంపాదించుకుంటాను. నచ్చిన మనిషిని పెళ్ళి చేసుకుంటాను, వేర్ ఈజ్ ది ప్రాబ్లం?"

"సమస్య రెండు వైపుల నుండి వొస్తుంది అనూ! మొదటిది రెండు పూర్తిగా వీభిన్నమైన లైఫ్ స్టైల్స్. చాలా, చాలా అడ్జస్ట్‌మెంట్ సమస్యలు వొస్తాయి. సర్దుకోవడం అంత తేలిక కాదు. రెండోది, ప్రపంచమంతా ఒక రకమైన విచిత్రమైన పోలరైజెడ్ పరిస్థితులలో వుంది. మా తరం కంటే ఈ తరంలో అసహనమూ, ఎగ్రెసివ్‌నెస్సూ ఎక్కువ అనిపిస్తున్నాయి నాకు. చుట్టూ ఇటువంటి వొలటైల్ వాతావరణంలో మతాంతర వివాహం వల్ల వచ్చే సమస్యలతో నీ బ్రతుకంతా నింపుకోవడం అవసరమా? అమ్మైనా, నేనైనా భయపడేది దాని గురించే."

అనూ కాసేపు ఏమీ మాట్లాడలేదు. చిన్నబోయిన మొహంతో మౌనంగా కూర్చుంది.

"కానీ, నాకతనంటే చాలా ఇష్టం నాన్నా. నేను ఏ సమస్యలొచ్చినా తట్టుకుంటాను. అయాం కాన్‌ఫిడెంట్!"

ఇరవై యేళ్ళ వయసులో వుండే అమాయకమైన ఇష్టానికి ఎంత శక్తి వుంటుందో అతనికి తెలియనిది కాదు. కానీ ఏదో అర్థం కాని భయం! బహుశా ఇలాటిదే భయం భాను తల్లి తండ్రులూ అనుభవించి వుంటారు. తమ కులాంతర వివాహం గురించి తన తల్లీ ఇలాగే భయపడిందా? ఏమో, ఎక్కువగా చెప్పనైతే లేదు. భాను తల్లిని ఒప్పించటానికే తమిద్దరూ ఎంతో కష్టపడ్డారు. అదంతా నిన్ననో మొన్ననో జరిగినట్టనిపిస్తుంది. ఇప్పుడు తనూ భానూ అదే వీధికి ఇంకో చివర్న నిలబడి వున్నారు. అతను నిట్టూర్చి పుస్తకం మూసేసాడు.

"నీ సంగతి సరే అనూ! అతని సంగతేమిటి? అతనికి ఇదంతా ఏటు దారి తీస్తుందో తెలుసా? అతనికీ అంత సులువైనదేమీ కాదు, ఇదంతా. ఇద్దరు మనుషులు ఇష్టపడటమంత తేలిక కాదు, పెళ్ళంటే. సంప్రదాయాలూ, వ్యక్తిత్వాలూ, పరిస్థితులూ, ఆర్థిక ఇబ్బందులూ, ఎక్స్‌పెక్టేషన్లూ, అన్నిటితో సంఘర్షణలూ, చాలా చికాకైన వ్యవహారం నాన్నా!"

"నాన్నా! అయాం సర్‌ప్రైజ్డ్. నువ్వూ అమ్మా ముప్పై యేళ్ళ క్రితం ఇంటర్–కేస్ట్ పెళ్ళి చేసుకున్నారు. మీరే మమ్మల్ని నిరుత్సాహపరుస్తున్నారు! ఇక మిగతా వాళ్ళ ఇళ్ళల్లో ఎలా వుంటుందో! ఇంకో విషయం, నువ్వన్న

సంఘర్షణలూ, సమస్యలూ మామూలుగా అందరూ అంగీకరించిన పెళ్ళిళ్ళల్లో కూడా వుంటాయి కదా? అయినా, మేమిద్దరం, వీ విల్ ఫిగర్ అవుట్. ఎలాగో మేనేజ్ చేస్తాం నాన్నా!"

చిన్నగా నవ్వాడు అశోక్.

"ఇరవై యేళ్ళప్పుడు చెప్పే ఆ వాక్యం ఎంతో అందమైనది."

"అవునా? మరి యాభై యేళ్ళప్పుడు?"

యాభై యేళ్ళప్పుడు? తన చుట్టు తను శ్రద్ధగా పేర్చుకున్న పుస్తకాల జ్ఞానాన్ని పరికించి చూసాడు.

"యాభై యేళ్ళప్పుడు బ్రతుకులో చాలా విషయాలు అనుభవం మీద గానీ అర్థం కావన్న విషయం తెలుస్తుంది."

"అది సరే, నాన్నా! చెప్పు. నీకూ అమ్మకీ చాలా ఇబ్బందులొచ్చాయా? నానమ్మా, అమ్మమ్మా, తాతయ్యా, వీళ్ళని కన్విన్స్ చేయడం చాలా కష్టమయిందా?" కుతూహలంగా అడిగింది అనఘ.

నవ్వి, సోఫా లోంచి లేచాడు అశోక్.

"ఇప్పుడదంతా హిస్టరీ! మాకొచ్చిన సమస్యలు మాకు తోచినట్టు తీర్చుకున్నాం. సరే, నువ్వు మాత్రం చదువు విషయంలో అశ్రద్ధగా వుండడానికి వీల్లేదు. నీ కాళ్ళ పైన నువ్వు నిలబడ్డాకే పెళ్ళి. చదువూ, ఉద్యోగమూ ఎంత ముఖ్యమైనవో ఇప్పుడు నీకర్థం కావడంలేదు. నో కాంప్రమైజ్ ఆన్ దట్."

"నాన్నా! నువ్వు నా పక్కనే వుంటావుగా?" తండ్రి చేతిలో తన చేయి వుంచి అడిగింది అనూ. దాదాపు తనంత పొడుగెదిగిపోయిన కూతురు అమాయకపు మొహం చూస్తే మనసు కరిగిపోయిందతనికి.

★★★★★★★★★★★★★★★★★★

ఉదయాన్నే భాను కాఫీ కప్పుతో బాల్కనీలో కూర్చొని వుంది. డిసెంబరు నెల చలి హైదరాబాదులో వొణికిస్తున్నా, చిన్నప్పుడున్నంత చలి లేదు, అనుకుంది భాను.

ఏమిటో, హైదరాబాదులోనే యాభై యేళ్ళూ గడిచిపోయాయి. వూరికే తిరుపతికో, చెన్నై, బెంగుళూరూ ఆఫీసు పనుల పైనో వెళ్ళి రావడం తప్ప హైదరాబాదు వొదిలి ఎక్కువరోజులు ఎక్కడా లేదు తను. అమ్మూ బెంగుళూరులో వున్నా, ఆఫీసు పని వొత్తిడితో అక్కడికీ వెళ్ళి వుండలేదు. ఈ మధ్యే బోరు కొడుతూ వుంది. దీనితోపాటు పిల్లల సమస్యలు. సమస్యల మాట ఎలా వున్నా, తనకి చాలా కోపమూ చిరాకూ ఎక్కువవుతున్నాయి. సూసీ క్రితం సారి ఫోన్‌లో "మెనోపాజ్" గురించి చెప్పింది. తనకూ అదే సమస్య మొదలవుతూ వుందా? అందుకేనా గత నాలుగైదు యేళ్ళుగా కొంచెం గ్లూమీగా, డిప్రెస్డ్ గా అనిపిస్తూ వుంది? చిన్నప్పణ్ణించీ ఏ అనారోగ్యమూ లేదు తనకు. ఇప్పుడిప్పుడే తనకీ శరీరమూ, మనసూ నెమ్మదిస్తున్నాయా? అప్పుడే తను ముసలిదైపోతూ వుందా?

అసలిప్పుడు అనూతో యేం చేయడం? తను అశోక్‌ని పెళ్ళాడతానన్నప్పుడు అమ్మ ససేమిరా వొద్దంది. వాళ్ళకి డబ్బు లేదనీ, అశోక్ చదువు అందరిలాటిది కాదనీ, బంధువుల్లో తలెత్తుకోలేమనీ అమ్మ చాలానే అభ్యంతరాలు లేవనెత్తింది. ఎలాగో వాళ్ళని ఒప్పించినా, పెళ్ళైన తరవాత కూడా అమ్మకి తన లైఫ్ స్టైల్ చాలా అసంతృప్తిగా వుండేది. తను తమ బంధువుల్లో అమ్మాయిల్లా ఖరీదైన చీరలూ, నగలూ కొనుక్కోదనీ అమ్మకి చాలా చిరాగ్గా వుండేది. అదృష్టవశాత్తూ అశోక్‌కి అకడేమిక్స్‌లో పెద్ద వుద్యోగం వచ్చి ఆమె కొంచెం సంతృప్తి పడింది. పైగా, ఇద్దరికీ సంప్రదాయాల్లో, భోజనం అలవాట్లలో పెద్ద తేడా లేదు. అశోక్ ఇంట్లో అంతా శాకాహారులే. తను పెద్దగా తిండి పైన పెద్ద ధ్యాస లేని మనిషి. దానివల్ల కూడా తామిద్దరికీ అడ్జస్ట్‌మెంట్ సమస్యలు ఎక్కువగా రాలేదు. కానీ, అనూ–అజహర్ ఇద్దరి కుటుంబ వ్యవహారాల్లో, పద్ధతుల్లో చాలా వ్యత్యాసాలు వున్నాయి. సర్దుకోగలుగుతుందా? స్నేహితులూ, బంధువుల అభిప్రాయాన్ని తాను ఎక్కువగా పట్టించుకోదు, అని అనుకుంటుంది కానీ, నిజంగా తను అలా వుండగలదా? అన్నీ చిక్కు ముళ్ళే! ఏం చేయాలి?

"గుడ్ మార్నింగ్ భానూ!" పద్మనాభం తలుపు తెరుచుకొని బాల్కనీలోకొచ్చాడు.

"గుడ్ మార్నింగ్ నాన్నా! లేచావా? కొంచెం టీ తీసుకొస్తాను," లేవబోయింది భాను.

"నాకిప్పుడు టీ వొద్దు, భానూ. కొంచెం సేపయాక నేనే పెట్టుకుంటాలే. యూ రిలాక్స్!"

తనూ కుర్చీలో కూర్చుంటూ చేతిలో న్యూస్ పేపర్ చదవటానికి తెరిచాడు. అంతలోనే పేపరు మళ్ళీ మడిచి పక్కన పెట్టేసాడు.

"నాన్నా, నేనూ అశోక్ పెళ్ళి చేసుకుందామనుకున్నప్పుడు అమ్మ ఇలాగే బాధ పడిందా? నువ్వు భయపడ్డావా?"

పద్మనాభం కాసేపు చేతిలో పేపర్ వైపే చూస్తూ వుండి పోయాడు.

"భానూ, నువ్వూ అశోక్ మీ నిర్ణయం చెపినప్పుడు, భయం కంటే ఎక్కువ డిజప్పాయింట్ అయాను. నేను తండ్రిలా ఓడిపోయాననుకున్నాను!"

"దట్ వాజ్ డ్రమటిక్! ఎప్పుడూ నాతో చెప్పనేలేదు."

"అమ్మా నాన్నలు పిల్లలతో చాలా విషయాలు చెప్పరు. ఆ సంగతి ఈ పాటికి నీకూ తెలిసుండాలి!"

భాను కళ్ళు దించుకుంది.

"తరవాత నేనూ అమ్మా మాట్లాడుకున్నాం. నిజానికి, మీ అమ్మ కంటే నాకే ఎక్కువగా మీ పెళ్ళి ఇష్టం లేదు. అమ్మదేముంది, ఇంట్లో వుండే మనిషి, అందుకే ఏదీ పట్టించుకోవడం లేదు, అనుకున్నాను. కానీ, నాకు ఆఫీసులో కోలీగ్స్. బయట బంధువులూ! అందరి ముందూ అవమానంగా అనిపించింది. వాళ్ళందరూ అశోక్‌నీ, నిన్నూ చిన్నబుచ్చుతారేమో

అని భయపడ్డాను. పుట్టబోయే పిల్లల భవుష్యత్తు గురించి భయ పడ్డాను. అన్నిటి కంటే, పదేళ్ళ తరవాత నువ్వు పశ్చాత్తాపపడతావేమోనని భయపడ్డాను. నేను భయపడ్డవేమైనా జరిగాయా?"

భాను మాట్లాడలేదు.

"ఇప్పుడు నిన్నూ ఇవే ప్రశ్నలు బాధ పెడుతున్నాయని నాకు తెలుసు."

"నాన్నా! నేనొక హిపోక్రైట్‌నా?" భాను గొంతు వొణికింది.

"హిపోక్రట్‌వి కాదు కానీ, అమ్మవి!"

"చాలా ఆలోచించిన తరవాత నాకొకటి తట్టింది. నీకు ఆలోచించడమూ, నీ కాళ్ళ మీద నిబడడమూ నేర్పింది మేము. ఇప్పుడు వున్నట్టుండి నువ్వు ఆలోచించొద్దనీ, మా మాటే వినాలనీ ఆశపడటంలో అర్థం లేదు. అనఘుకి అన్నీ నేర్పిందే నువ్వు. మనుషులని కుల మతాల పేరుతో జడ్జ్ చేయకూడద్దనీ నువ్వూ అశోక్ నేర్పించారు. ఇప్పుడు వున్నట్టుండి దానికి కుల మతాలు చాలా ముఖ్యమని చెప్పడంలో ప్రయోజనమూ వుండదు, సరైన పద్ధతి కాదు కూడా! అసలేమిటి నీ అభ్యంతరం? అనూ చిన్న వయసు గురించా? అతను ముస్లిం అబ్బాయనా? అది ఆలోచించు ముందు. అక్కణ్ణించి మొదలు పెట్టు." భాను తండ్రి మాటలు మౌనంగా వింటూ కూర్చుంది.

"భానూ! పెళ్ళి యెటువంటిదైనా అమ్మా నాన్నలకి కొంచెం టెన్షనూ, ఏంగ్జయిటీ సహజమే. పిల్లలు వాళ్ళే ఎన్నుకున్న మనిషంటే ఆ ఏంగ్జయిటీ ఇంకా ఎక్కువ అవుతుంది. ఇలా లైఫ్ స్టైల్ తేడాలూ, ఇతర వ్యత్యాసాలూ వున్నప్పుడు టెన్షను ఎక్కువగా అనిపించడం కూడా సహజమే. అంతే. నిన్ను నేనూ అమ్మా నమ్మలేదూ? నువ్వూ అలాగే నీ పిల్లలని నమ్మడం నేర్చుకో. పొరపాట్లు చేయకూడదనీ, తప్పులు అసలే జరగొద్దనీ వాళ్ళని బెదరగొట్టే బదులు, బ్రతుకన్నాక పొరపాట్లూ, తప్పులూ తప్పవనీ, అలా అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు వాళ్ళ వెనక మీరిద్దరూ వున్నారనీ నొక్కి చెప్పు. నువ్వు పిల్లాలకివ్వల్సింది ఆ ధైర్యమూ, నమ్మకమూ!" ఎనభై యేళ్ళ అనుభవం ప్రేమగా నవ్వింది.

★★★★★★★★★★★★★

"భార్గవ్! ఇవాళ నువ్వు నా అక్కవుంట్లోకి ఇరవై వేలు వేసావా?" భాను అడిగింది. బయటికి వెళ్ళడానికి బూట్లు వేసుకుంటున్న భార్గవ్ తలెత్తాడు.

"అవునమ్మా! నేను ఉద్యోగం చేస్తున్నాను. అది నా మొదటి సంపాదన."

ఇన్స్టిట్యూట్‌కి వెళ్ళడానికి కారు తాళాలు తీసుకోబోతున్న అశోక్ కూడా ఆగిపోయాడు.

"అవునా?" సంభ్రమంగా అడిగింది భాను.

"ఏం వుద్యోగం?"

"వీడియో ఎడిటింగ్. సంపాదన పర్వాలేదు. వివరాలు రాత్రికి చెప్తాను. నాకు లేటవుతుంది."

"ఆగు, వీడియో ఎడిటింగ్ ఏమిట్రా?" అప్పటికే భార్గవ్ బయటికెళ్ళిపోయాడు. కాలేజీకెళ్ళడానికి బయటికొచ్చింది అను.

"అమ్మా, వీడియో ఎడిటింగ్ అంటే, పెళ్ళిళ్ళలో, ఫంక్షన్లలో తీసే విడియోలని ఎడిట్ చేసి పెట్టడం. అన్నయ్య అదే చేస్తున్నట్టున్నాడు బహుశా. మొన్నొక రోజు ఎవరో ఫ్రెండ్‌తో ఫోన్లో అంటూ వుంటే విన్నాను."

"పెళ్ళిళ్ళకీ ఫంక్షన్‌లకీ వీడియోలు తీసి డబ్బులు సంపాదిస్తాడా?"

"వాడు తీయడు. ఫోటోగ్రాఫర్లు తీస్తారు. ఆ తీసిన ఫిల్మంతా అన్నయ్యకిస్తే, వాడు ఎడిట్ చేసి ఇస్తాడు. దానికి అవసరమైన సాఫ్ట్ వేరంతా వాడి లాప్‌టాప్‌లో వుంది. ఫోటోగ్రాఫర్లకంటే అన్నయ్యే ఎడిటింగ్ బాగా చేస్తాడు. బోలెడంత డబ్బు." తనకిష్టమైన పనిలో స్థిరపడడానికి కొడుకు చేస్తున్న ప్రయత్నాలకి సంతోషపడాలో, అతని పని అంతగా నచ్చకపోవడంతో బాధ పడాలో అర్థం కాలేదు భానుకి.

★★★★★★★★★★

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS